
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పెద్దపల్లి జిల్లా వార్తలు
5★ ఆదివారం 10 మార్చి 2024



కొనుగోలు కేంద్రాల్లో ఇబ్బందులు కలగకుండా చర్యలు - ఎమ్మెల్యే విజయరమణారావు 8లో..

హుస్సేనిమియా వాగుపై హైలెవల్ బ్రిడ్జి నిర్మించేదెప్పుడో? 8లో..



ఇందిరమ్మ ఇళ్లకు రేపే శ్రీకారం

- రేషన్‌కార్డు ఉన్నవారికే మంజూరు
- నాలుగు దశల్లో బిల్లుల చెల్లింపు
- జిల్లాకు 9 వేల ఇళ్లు కేటాయించే అవకాశం

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

ఇందిరమ్మ ఇళ్లపై పేద, మధ్య తరగతి కుటుంబాలు ఆశలు పెంచుకున్నాయి. లబ్ధిదారుల ఎంపిక విషయమై ఎలాంటి నిబంధనలు విధిస్తారోనని ఎదురుచూస్తున్న క్రమంలో ప్రభుత్వం మార్గదర్శకాలను రూపొందించింది. రేషన్ కార్డు కలిగి ఉన్న వారికే ఇందిరమ్మ ఇళ్లు మంజూరుచేయాలని నిర్ణయం తీసుకున్నది. రేషన్ కార్డులు లేనివాళ్లు సంబంధిత కార్యాలయాల్లో దరఖాస్తులు చేసుకోవాలని పేర్కొంది. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలతో పాటు, పలు పథకాలను ప్రకటించింది. తాము అధికారంలోకి వస్తే పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన వారికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరుచేస్తామని, ఒక్కో ఇంటి నిర్మాణానికి 5 లక్షల రూపాయలు అందజేస్తామని ప్రకటించింది. ఆరు గ్యారంటీల్లో ఒకటైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఈనెల 11న భద్రాచలంలో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి శ్రీకారం చుట్టనున్నారు. గత ప్రభుత్వ హయాంలో డబుల్ బెడ్ రూముల ఇళ్లు నిర్మించి ఇస్తామని చెప్పి నిర్మించిన ఇళ్లను ఇప్పటి వరకు ఏ ఒక్క లబ్ధిదారులకు ఇచ్చిన దాఖలాలు జిల్లాలో లేవు. ఆ తర్వాత గృహలక్ష్మి పథకం కింద సొంత స్థలం ఉన్నవారికి ఇళ్లు మంజూరు చేస్తామని, దాని కింద 3 లక్షలు అందజేస్తామని ఎన్నికలకు ముందు ప్రకటిం చింది. ఆ మేరకు జిల్లాలో అనేక మంది దరఖాస్తు చేసుకున్నప్పటికీ, కొన్ని ఇళ్లు మాత్రమే మంజూరయ్యాయి. అయితే రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో కాంగ్రెస్ పార్టీ ప్రక టించిన ఇందిరమ్మ ఇళ్ల పథకంపై ఆశలు పెంచుకున్నారు. గత ప్రభుత్వ హయాంలో మంజూరుచేసిన ఇళ్లను కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేసింది. ప్రతి ఏటా రాష్ట్ర వ్యాప్తంగా 4 లక్షల 50 వేల ఇళ్లు మంజూరు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నది. ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇళ్లు కేటాయించారు. ఈ లెక్కన 119 నియోజకవర్గాలకు 4,16,500 ఇళ్లు అయితే, మిగతా 33,500 ఇళ్లను రిజర్వులో పెట్టారు. అవసరానికి బట్టి ఆ ఇళ్లను ప్రత్యేక కోటా కింద ముఖ్యమంత్రి గానీ, ఇన్‌చార్జీ మంత్రులు మంజూరు చేయనున్నారు. జిల్లాలో పెద్దపల్లి, రామగుండం, మంథని అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. పెద్దపల్లి, రామగుండం నియోజకవర్గాలు పూర్తిగా, మంథని నియోజకవర్గంలోని మంథని, రామగిరి, ముత్తారం, కమాన్‌పూర్ మండలాలు జిల్లాలో, జగిత్యాల జిల్లా ధర్మపురి నియోజకవర్గ పరిధిలోని ధర్మారం జిల్లాలో ఉంది. వీటన్నింటికీ కలిపి ఈ ఏడాది జిల్లాకు 9వేల ఇళ్ల వరకు మంజూరయ్యే అవకాశాలున్నాయి. ఇళ్ల కోసం ఇప్పటికే డిసెంబర్ 28నుంచి జనవరి 6వ తేదీ వరకు నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమం ద్వారా దరఖాస్తు చేసుకున్నారు.

మొదటి దశలో సొంత స్థలం ఉన్నవారికే..

మొదటి దశలో సొంత స్థలం గానీ, ప్రభుత్వం ఇదివరకే ఇచ్చిన స్థలం ఉన్నవారికే గానీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయనున్నారు. రెండవ దశలో పూర్తిగా భూమి లేని వారికి ప్రాధాన్యం ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రజాపాలన ద్వారా వచ్చిన దరఖాస్తులనే ప్రామాణికంగా తీసుకోవాలని, తప్పనిసరిగా రేషన్‌కార్డు కలిగి ఉండాలని ప్రభుత్వం పేర్కొంది. గుడిసె ఉన్నా, గడ్డితో పైకప్పు ఉన్నా, మట్టి గోడల ఇళ్లు ఉన్నవారికి, మొత్తానికే ఇల్లు లేక అద్దె ఇళ్లల్లో నివసిస్తున్న వారికి ప్రాధాన్యం ఇవ్వనున్నారు. మహిళల పేరిటనే ఇళ్లు మంజూరుచేయనున్నారు. ఆర్‌సీసీ రూఫ్‌తోనే ఇంటిని నిర్మించాలని పేర్కొన్నారు. ఇంటి నిర్మాణాలకు సంబంధించి మూడు, నాలుగు డిజైన్లు సిద్ధం చేస్తున్నారు. బిల్లులను నాలుగు దశల్లో చెల్లించాలని నిర్ణయించారు. బేస్‌మెంట్ పూర్తయిన తర్వాత ఒక లక్ష, రూఫ్ లెవల్ వరకు నిర్మాణం అయిన తర్వాత ఒక లక్ష, పైకప్పు వేసిన తర్వాత 2 లక్షలు, మొత్తం ఇళ్లు పూర్తయిన తర్వాత చివరి దశలో లక్ష రూపాయల బిల్లు ఇవ్వనున్నారు. లబ్ధిదారుల ఎంపికను ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తుల ఆధారంగా ఎమ్మెల్యేల ద్వారానే చేయనున్నారు. ఆ తర్వాత జాబితాలను క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపిన అనంతరం తుది జాబితాను జిల్లా ఇన్‌చార్జీ ఆమోదానికి పంపించనున్నారు. ఆయన ఆమోద ముద్ర వేసిన కలెక్టర్ మంజూరుచేసి ప్రొసీడింగ్స్ అందజేయనున్నారు. ఆ వెంటనే లబ్ధిదారులు ఇంటి నిర్మాణాన్ని ప్రారంభించాల్సి ఉంటుంది. ఇంటి నిర్మాణ పనుల ప్రారంభానికి కొంత గడువు విధించనున్నారు. ఆలోపు ప్రారంభించకుంటే రద్దు చేసి మరొకరికి మంజూరుచేయనున్నారు.

జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడిగా వడ్డేపల్లి రాంచందర్


వడ్డేపల్లి రాంచందర్

గోదావరిఖని, జ్యోతినగర్, మార్చి 9: జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడిగా గోదావరిఖనికి చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు వడ్డేపల్లి రాంచందర్‌ను నియమించారు. ఈ మేరకు ఈ మేరకు కేంద్ర సామాజిక న్యాయం, సాధికారిత శాఖ పంపిన ప్రతిపాదనలకు రాష్ట్రపతి ద్రౌపది ముర్మ్ము ఆమోదించారు. ఈ మేరకు ఆ శాఖ అదనపు కార్యదర్శి సురేంద్రసింగ్ ఉత్తర్వులు జారీచేశారు. ఎన్‌టీపీసీ ఉద్యోగి అయిన వడ్డేపల్లి రాంచందర్ ప్రస్తుతం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా కొనసాగుతున్నారు. గోదావరిఖని కృష్ణనగర్‌కు చెందిన రాంచందర్ బాల్యం నుంచి ఆర్‌ఎస్‌ఎస్‌లో క్రియా శీలకంగా పని చేశారు. బీజేపీ జాతీయ కౌన్సి ల్ సభ్యుడిగా పదేళ్లపాటు పనిచేశారు. రాంచందర్‌ను జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యునిగా నియమించడంపై రాష్ట్ర ఎస్సీ కమిషన్ సభ్యుడు కొంకటి లక్ష్మీనారాయణ హర్షం వ్యక్తం చేశారు.

'ఖని'లో రూ.140కోట్లతో 355 పడకల ఆసుపత్రి

- అత్యాధునిక ఆపరేషన్ థియేటర్లు, వార్డుల ఏర్పాటు
- నేడు నిర్మాణ పనులకు శంకుస్థాపన

కళ్యాణ్‌నగర్, మార్చి 9: గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి(జీజీహెచ్) ఆవరణలో అదనదంగా 355పడకల ఆసుపత్రి బ్లాక్‌ను నిర్మించనున్నారు. సింగరేణి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(సిమ్స్)కు అనుబంధంగా ఈ నిర్మాణం జరుగనున్నది. సింగరేణి సంస్థ మెడికల్ కళాశాలకు కేటాయించిన రూ.510 నుంచి రూ.140 కోట్లతో 355పడకల బ్లాక్ నిర్మాణానికి వెచ్చించనున్నారు. ఈ బ్లాక్‌లో అన్నీ సదుపాయాలతో వార్డులు, అత్యాధునిక ఆపరేషన్ థియేటర్లు, వెంటిలేటర్, ఐసీయూలు ఏర్పాటు చేయన్నాను. ఇదే బ్లాక్‌లో ఎయిర్ కండీషన్ మార్చురీ కూడా ఏర్పాటు చేయన్నారు. రోగులు సౌకర్యార్థం ప్రత్యేక క్యాంటీన్ ఏర్పాటుచేయడంతో పాటు రోగుల వద్ద ఉండే సహాయకులకు ప్రత్యేక విశ్రాంత గదులను కూడా ఏర్పాటు చేయనున్నారు. సింగరేణి సంస్థ సిమ్స్ నిర్మాణానికి రూ.510కోట్లు కేటాయించగా ఇప్పటికి రూ.290కోట్లు వెచ్చించారు. ఇందులో రూ.200కోట్లతో నిర్మాణాలు,సుమారు రూ.100 కోట్లతో ఫర్నీచర్, ఇతర సౌకర్యాలు కల్పించారు. మిగిలిన రూ.200కోట్లతో సిమ్స్‌కు అనుబంధంగా గల జీజీహెచ్‌లో నిర్మాణాలు, ఇతర సౌకర్యాలు కల్పించనున్నారు. ఇప్పటికే రూ.23కోట్లతో ప్రత్యేకంగా క్రిటికల్ కేర్ బ్లాక్‌ను నిర్మిస్తున్నారు. 50పడకలతో నిర్మించే ఈ బ్లాక్‌లో ఐసీయూలు, ఇతర ఆపరేషన్ థియేటర్లు, అత్యవసర సర్వీస్ విభాగాలు ఏర్పాటు చేస్తారు. రూ.140కోట్లతో నిర్మించనున్న 350 పడకల ఆసుపత్రి నిర్మాణ పనులను ఆదివారం రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ ప్రారంభించనున్నారు.

బీజేపీ మహిళా మోర్చా కార్యవర్గ సభ్యురాలిగా లావణ్య


సోమారపు లావణ్య

కళ్యాణ్‌నగర్, మార్చి 9: బీజేపీ మహిళా మోర్చా కార్యవర్గ సభ్యురాలిగా సోమారపు లావణ్య నియమితులయ్యారు. ఈ మేరకు బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ శిల్పారెడ్డి నియామకాన్ని ప్రకటించారు. గతంలో కూడా సోమారపు లావణ్య మహిళా మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలిగా పని చేశారు. బీజేపీ సభ్యత్వ నమోదులో ఆమె క్రియాశీలకంగా పని చేశారు.

పంచాయతీ కార్మికుల బకాయి వేతనాలు చెల్లించాలి

- యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఎరవెల్లి ముత్యంరావు

పెద్దపల్లి రూరల్, మార్చి 9 : పంచాయతీల్లో కార్మికుల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని గ్రామపంచాయతీ ఎంప్లాయీస్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఎరవెల్లి ముత్యంరావు అన్నారు. శనివారం మండలంలోని అప్పన్నపేటలో యూనియన్ సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ముత్యంరావు మాట్లాడుతూ జిల్లాలో పంచాయతీ కార్మికులకు రెండు నెలల నుంచి 11నెలల వేతనాలు బకాయిలు ఉన్నాయన్నారు. ఈ సమస్యపై కలెక్టర్, ఎమ్మెల్యేలు, అధికారులకు విన్నవించినా ఫలితం లేదన్నారు. మార్చి 11న కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్నామని, అనంతరం జిల్లా పంచాయతీ శాఖ అధికారికి సమ్మె నోటీస్ అందించనున్నట్లు పేర్కొన్నారు. కార్మికుల వేతనాల చెల్లింపులో నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదన్నారు. మార్చి 11న నిర్వహించే ధర్నాలో జిల్లాలోని పంచాయతీ కార్మికులందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా కార్యదర్శి ఎండి ఖాజా, నాయకులు జంగపల్లి నరేష్, కట్ల శ్రీనివాస్, ఎండి ముస్తాఫా, రేణికుంట్ల సందీప్, బండి రాజయ్య, అరికిల్ల కొండయ్య పాల్గొన్నారు.

క్రిసెంట్ పాఠశాలలో వైజ్ఞానిక ప్రదర్శన

కాల్వశ్రీరాంపూర్, మార్చి 9: మండలంలోని ఇప్పల పల్లి, పెగడపల్లిలోని క్రిసెంట్ పాఠశాలల ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో శనివారం వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. విద్యార్థిని విద్యార్థు లు సుమారు 100ప్రాజెక్టులు స్వయంగా తయారుచేసి ప్రదర్శించడం జరిగింది. వీటిలో చంద్రయాన్-3, బ్లడ్ గ్రూప్‌టెస్ట్, రోబో, మంకీగన్, లైఫై, సేఫ్టీ అలారం, గ్లోబల్ వార్మింగ్, డయాలసిస్, వాక్యూమ్ క్లీనర్, సోలార్ పవర్, స్మార్ట్ సిటీ, స్మార్ట్ గేట్, గ్రాస్ కట్టర్, ఆటోమేటిక్ స్ట్రీట్‌లైట్స్, ప్లాస్టిక్ నష్టాలు, ఆటోమేటిక్ పవర్ జనరేట్‌లాంటి తదితర ప్రాజెక్టులు చూపరులను అలరించాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ ఎన్‌ఏ అయాజ్, మాజీ సర్పంచ్ ఆరెల్లి సుజాతరమే ష్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సయ్యద్ నసీర్, ఉపాధ్యాయులు, పోషకులు పాల్గొన్నారు.

కాళేశ్వరం జోన్‌లో 25మంది ఎస్‌ఐల బదిలీ

- రామగుండం కమిషనరేట్‌లో పలువురికి స్థానచలనం

కోల్‌సిటీ, ఫిబ్రవరి 9: పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి ఎన్నికల కమిషన్ నిబంధనలతో కాళేశ్వరం జోన్-1 పరిధిలోని 25మంది ఎస్‌ఐలను బదిలీ చేస్తూ ఆదేశాలు వెలువడ్డాయి. రామగుండం పోలీస్ కమిషనరేట్‌తోపాటు జయశంకర్ భూపాలపల్లి జిల్లా, కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని ఎస్‌ఐలను బదిలీ చేశారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పలువురి ఎస్‌ఐలకు స్థానచలనం కలిగింది. మంచిర్యాల ఎస్‌ఐ జగదీష్‌కు తాండూర్ ఎస్‌ఐగా పోస్టింగ్ ఇచ్చారు. వీఆర్‌లో ఉన్న జితేందర్‌సింగ్‌ను సీసీసీ నస్పూర్ ఎస్‌ఐ-2గా నియమించారు. పెద్దపల్లి సీసీఎస్‌లో పనిచేస్తున్న ఎస్‌ఐ స్వరూప్‌రాజ్‌ను దండేపల్లి ఎస్‌ఐగా నియమించారు. కమిషనరేట్‌లో వీఆర్‌లో ఉన్న ఎం లక్ష్మీప్రసన్నను శ్రీరాంపూర్ ఎస్‌ఐ-2గా నియమించారు. నెన్నెల ఎస్‌ఐ శ్యాంపటేల్‌ను నీల్వాయికి బదిలీచేయగా నిల్వాయిలో ఉన్న సుబ్బారావును రామగుండం వీఆర్‌కు బదిలీచేశారు. మంచిర్యాల ఎస్‌ఐ-3గా పనిచేస్తున్న కుందారపు ప్రసాద్‌ను నెన్నెల ఎస్‌హెచ్‌ఓగా, శ్రీరాంపూర్ మహిళా పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐ విజయ్‌కుమార్‌ను భీమినికి బదిలీ చేశారు. అక్కడ పనిచేస్తున్న రామగుండం వీఆర్‌లో ఉంచారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం ఎస్‌ఐ-2 సురేష్‌ను బెల్లంపల్లి వన్‌టౌన్-2 ఎస్‌ఐగా, అక్కడ పనిచేస్తున్న వీ ప్రవీణ్‌ను కాసిపేట ఎస్‌ఐగా నియమించారు. జైపూర్ ఎస్‌హెచ్‌ఓ ఉపేందర్‌ను మంచిర్యాల టాస్క్‌ఫోర్స్‌కు బదిలీ చేశారు. ఆయనస్థానంలో భూపాలపల్లి జిల్లా వీఆర్‌లో ఉన్న జే శ్రీధర్‌కు పోస్టింగ్ ఇచ్చారు. అలాగే వీఆర్‌లో ఉన్న కే రాజేష్‌కు పెద్దపల్లి టాస్క్‌ఫోర్స్ ఎస్‌ఐగా, టీ శ్రీనివాస్ గోదావరిఖని వన్‌టౌన్ ఎస్‌ఐ-4గా నియమించారు. రవి ప్రసాద్‌ను రామగుండం ట్రాఫిక్ ఎస్‌ఐగా నియమించారు. కిరణ్‌కుమార్‌ను సీసీఎస్ మంచిర్యాలకు, ఎస్ లక్ష్మణ్‌ను మంచిర్యాల టౌన్‌కు బదిలీ చేశారు. కొము రంభీం జిల్లా దహెగాం ఎస్‌హెచ్‌ఓ సనత్‌కుమార్‌ను గోదావరిఖని టుటౌన్ ఎస్‌ఐ-4గా నియమించారు. గోదావరిఖని ట్రాఫిక్‌లో పని చేస్తున్న అనూషను మంచిర్యాల టౌన్‌కు బదిలీ చేశారు. అలాగే గోదావరిఖని వన్‌టౌన్‌లో పని చేస్తున్న శరణ్యను సీసీఆర్‌బీకి బదిలీ చేసి వీఆర్‌లో ఉన్న ఎస్‌ఐ వెంకటేష్‌కు గోదావరిఖని టుటౌన్‌లో పోస్టింగ్ ఇచ్చారు.

ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్న ప్రభుత్వం


మాట్లాడుతున్న ప్రభుత్వ సలహాదారు హర్కార వేణుగోపాల్‌రావు

అంతర్గాం, మార్చి 9: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పని చేస్తున్నదని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు హర్కార వేణుగోపాల్‌రావు అన్నారు. శనివారం రామగుండం పట్టణంలోని ఎంఎన్ గార్డెన్‌లో స్థానిక ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్‌ఠాకూర్ ఆధ్వర్యంలో వేణుగోపాల్‌రావును ఘనంగా సన్మానించారు. అనంతరం వేణుగోపాల్‌రావు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఆరు గ్యారంటీలను అమలుచేసి తీరుతుందని పేర్కొన్నారు. అనంతరం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ మాట్లాడుతూ రామగుండంలో రెండు 800మెగావాట్ల విద్యుత్ కేంద్రాల ఏర్పాటుకు కృషి చేసి రామగుండానికి పూర్వవైభవం తీసుకువస్తానన్నారు. గడిచిన మూడు నెలల కాలంలో రామగుండానికి రూ.100కోట్ల నిధులు తీసుకువచ్చానని పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు సహకారంతో పెద్ద ఎత్తున నిధులు తీసుకువచ్చి రామగుండాన్ని సమగ్రంగా అభివృద్ధి పరుస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ బంగి అనిల్ కుమార్, ఐఎన్‌టీయూసీ నాయకుడు జనక్ ప్రసాద్, నాయకులు బందారపు బుగ్గరాములుగౌడ్, ఈదునూరి హరిప్రసాద్, పెండ్యాల మహేష్, ఉరిమెట్ల రాజలింగం, ఎండీ వాజిద్‌ఖాన్, అప్పాసి శ్రీనివాస్, ఇష్తాకర్ తదితరులు పాల్గొన్నారు.

యువతకు ఉపాధి కల్పించేందుకు చర్యలు

- పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు


జాబ్ మేళాలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయరమణారావు

పెద్దపల్లిటౌన్, మార్చి 9: రాష్ట్రంలోని ప్రతి నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించే దిశగా ప్రజా ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తోందని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు పేర్కొన్నారు. నందన గార్డెన్‌లో తెలంగాణ స్టేట్ సొసైటీ ఫర్ ట్రైనింగ్ అండ్ ఎంప్లాయిమెంట్ ప్రమోషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా జాబ్ మేళా కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా చింతకుంట విజయరమణారావు మాట్లాడుతూ జిల్లాలో ఉన్న నిరుద్యోగ యువతీ, యువకులు ప్రైవేట్ రంగంలో అందుబాటులో ఉన్న ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకునే విధంగా మంత్రి శ్రీధర్‌బాబు చొరవతో మెగా జాబ్ మేళాలు జిల్లాలోని ప్రతి అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో నిర్వహిస్తున్నామన్నారు. నిరుద్యోగ యువతీ, యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధి అధికారి వై.తిరుపతిరావు మాట్లాడుతూ మొత్తంగా 65పైగా ప్రైవేటు కంపెనీలచే నిర్వహించిన ఈ జాబ్ మేళాలో 312 మంది అభ్యర్థులు ఎంపిక అయినట్లు తెలిపారు. అనంతరం ఎంపికైన అభ్యర్థులకు ఎమ్మెల్యే వారికి ఎంపిక పత్రాలను అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డీవైఎస్‌వో ఎ.సురేష్, ధ్రువ్ కన్సల్టింగ్ సర్వీసెస్ డైరెక్టర్ సత్యవాణి తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగాన్ని రూపుమాపడమే ప్రభుత్వ లక్ష్యం

- రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్


జాబ్ మేళాలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

కళ్యాణ్‌నగర్, మార్చి 9: రామగుండం నియోజకవర్గంలో నిరుద్యోగాన్ని రూపుమాపడమే ప్రభుత్వ లక్ష్యమని, భావి తరాలకు బంగారు బాటలు వేసే దిశగా చర్యలు తీసుకుంటున్నామని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ అన్నారు. శనివారం గోదావరిఖని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో తెలంగాణ స్టేట్ సొసైటీ ఫర్ ట్రైనింగ్ అండ్ ఎంప్లాయిమెంట్ ప్రమోషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా జాబ్‌మేళాకు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. రామగుండంలో అందుబాటులో ఉన్న వనరులను వినియోగించుకుంటూ నిరుద్యోగాన్ని పూర్తిస్థాయిలో తొలగించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని చెప్పారు. ఎవరైనా ఉద్యోగాల పేరుతో డబ్బులు వసూలు చేస్తే ఉపేక్షించేది లేదని, వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తామని హెచ్చరించారు. త్వరలోనే తిలక్‌నగర్ సెంటర్‌లో స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాన్ని ప్రారంభించనున్నట్లు, ఈ కేంద్రంలో నిరుద్యోగ యువతకు శిక్షణ ఇవ్వనున్నట్లు ఆయన చెప్పారు. కాగా, జాబ్‌మేళాలో రామగుండం నియోజకవర్గ పరిధిలో 386మంది అభ్యర్థులు ఎంపిక కాగా వారికి మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ నియామక పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మేయర్ బంగి అనిల్ కుమార్, ఏసీపీ మడక రమేష్, కార్పొరేటర్లు పెద్దెల్లి తేజస్విప్రకాష్, బొంతల రాజేష్, మహంకాళి స్వామి, ఎండీ ముస్తాఫా, బాల రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మోడల్ సిటీగా తీర్చిదిద్దేందుకు డీపీఆర్ తయారుచేయాలి

- నాలాల్లో చెత్త వేయకుండా ప్రత్యేక ఫెన్సింగ్ - రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్


అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

కోల్‌సిటీ, మార్చి 9: రామగుండంను మోడల్ సిటీగా తయారు చేసేందుకు అవసరమైన పూర్తి స్థాయి ప్రాజెక్టు రిపోర్టు డీపీఆర్‌ను రూపొందించాలని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ ప్రజారోగ్యశాఖ ఎస్‌ఈ శ్రీనివాసరావుకు సూచించారు. శనివారం టీయూఎఫ్‌ఐడీసీ ప్రతిపాదిత పనులు, అమృత్ ప్రతిపాదిత పనులపై ఆయన ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్‌తో చర్చించారు. అమృత్‌లో ఎస్‌టీపీల నిర్మాణంతో పాటు వ్యర్థ జలాలు ఓపెన్ నాలాలో కలువకుండా ప్రత్యేక పైప్‌లైన్ల ద్వారా ఎస్‌పీటీలకు మర్లే పనులు ఉన్నాయన్నారు. మొదటి దశలో ఎస్‌టీపీల నిర్మాణం జరుగనున్నదని ఆయన పేర్కొన్నారు. టీయూఎఫ్‌ఐడీసీ పనుల్లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు కూడా ప్రతిపాదించారని ఆయన వివరించారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే స్మార్ట్ సిటీ మాదిరిగానే రామగుండంలో మోడల్ సిటీ వ్యవస్థను తయారు చేయాలన్నారు. 50ఏళ్ల అవసరాలకు సరిపోయేలా డీపీఆర్‌ను రూపొందించాలన్నారు. లక్ష్మీనగర్, కళ్యాణ్ నగర్, ఉల్లిగడ్డ బజార్, మేదరిబస్తీల్లో కెపాసిటీకి సరిపోయేంత పైప్‌లైన్ డిజైన్ చేయాలని, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం తరువాత వాటర్ పైప్‌లైన్లు, ఎలక్ట్రికల్ లైన్లు వేసిన తరువాత సీసీ రోడ్లు వేయాలన్నారు. నాలాలు ఆక్రమణలకు గురయ్యాయని, పూడిక కూడా తీయలేని పరిస్థితి ఉందన్నారు. నాలాల ఆక్రమణలను తొలగించడమే కాకుండా నాలాల్లో చెత్త వేయకుండా 12అడుగుల మేర పెన్సింగ్ ఏర్పాటు చేయాలని, ఈ మేరకు ప్రతిపాదనలు తయారు చేయాలని అధికారులకు సూచించారు. కాగా, టీయూఎఫ్‌ఐడీసీలో ప్రతిపాదించిన పనులకు పూర్తిస్థాయి డీపీఆర్‌ను రూపొందించి టెండర్ల ఆమోదం పొందవల్సి ఉందని, ఇందుకు కొంత సమయం పడుతుందని తెలిపారు. సమీక్షలో మేయర్ బంగి అనిల్ కుమార్, కార్పొరేటర్ మహంకాళి స్వామి, ప్రజారోగ్యశాఖ డీఈ సంపత్‌రావు, ఏఈ మౌనిక, మున్సిపల్ కార్పొరేషన్ ఏఈ షాబాద్ తదితరులు పాల్గొన్నారు.

టీయూఎఫ్‌ఐడీసీ ప్రతిపాదనలపై ఎస్ఈ పరిశీలన

టీయూఎఫ్‌ఐడీసీలో ప్రతిపాదించిన పనులపై శనివారం ప్రజారోగ్యశాఖ వరంగల్ సర్కిల్ ఎస్ఈ శ్రీనివాసరావు క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపారు. ప్రతిపాదిన ప్రధాన నాలాలు, సింగరేణి నిర్మిస్తున్న ఎస్‌టీపీని ఆయన పరిశీలించారు.

గీత కార్మికుడికి గాయాలు

హుజూరాబాద్‌రూరల్, మార్చి 9: మండలంలోని తుమ్మనపల్లి గ్రామానికి చెందిన గొడిశాల శేఖరయ్య అనే గీత కార్మికుడు శనివారం తాటి చెట్టు పైనుంచి కిందపడి గాయపడ్డాడు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం... వృత్తిలో భాగంగా శేఖరయ్య తాటి చెట్టు ఎక్కి కల్లు తీస్తున్న క్రమంలో మోకు జారటంతో జారి కిందపడి తలకు, కాళ్లకు గాయాలయ్యాయి. గమనించిన తోటి గీత కార్మికులు వెంటనే చికిత్స నిమిత్తం వరంగల్ ఆసుపత్రికి తరలించారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

● రూ.10వేల నగదు, బంగారం అపహరణ

కోనరావుపేట, మార్చి 9: కోనరావుపేట మండల కేంద్రంలో తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీకి పాల్పడి నగదుతో పాటు బంగారం అపహరించారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన సామ నరసింహారెడ్డి శుక్రవారం సాయంత్రం ఇంటికి తాళం వేసి కూరగాయలను అమ్మడానికి వెళ్లాడు. ఇదే అదనుగా భావించిన గుర్తు తెలియని వ్యక్తులు కిటికీలో నుంచి ఇంట్లోకి చొరబడి బీరువా పగలగొట్టి పదివేల రూపాయల నగదు, అర్థతులం బంగారం అపహరించారు.

నరసింహారెడ్డి కూరగాయలు అమ్మిన అనంతరం రాత్రి ఇంటికి తిరిగివచ్చి చూసేసరికి కిటికీ నుంచి గుర్తు తెలియన వ్యక్తి వచ్చి బీరువా పగలగొట్టి దొంగతనానికి పాల్పడినట్టు గుర్తిం చాడు. ఈ విషయమై కోనరావుపేట ఎస్సై ఆంజనేయులుకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బీఆర్‌ఎస్‌లో ముదురుతున్న సంక్షోభం

● పార్టీ నుంచి ఐదుగురు కౌన్సిలర్ల సస్పెన్షన్

వేములవాడ, మార్చి 9: వేములవాడ పురపాలక సంఘం పరిధిలో బీఆర్‌ఎస్ పార్టీలో సంక్షోభం ముదురుతోంది. శాసనసభ ఎన్నికలలో ఓటమి తో ఇప్పటికే ఆ పార్టీ కార్యకర్తలలో మనోధైర్యం దెబ్బతినగా, ఎన్నికల అనంతరం ఆ పార్టీ కౌన్సిలర్లు కారు దిగి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ క్రమంలో వేములవాడ మున్సిపల్ వైస్ చైర్మన్ ఎన్నిక వ్యవహారం ఆ పార్టీకి మరింత తలనొప్పిగా మారి ఐదుగురు కౌన్సిలర్ల సస్పెన్షన్‌కు దారితీసింది. మార్చి 7వ తేదీన జరిగిన వైస్ చైర్మన్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి మారం కుమార్ ఓటమిపాలయ్యారు. సొంత పార్టీకే చెందిన కౌన్సిలర్లు పార్టీ విప్‌ను కూడా ధిక్కరించి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బింగి మహేష్‌కు ఓటు వేశారు. దీంతో మారం కుమార్‌కు ఓటమి తప్పలేదు. ఈ ఎన్నికపై పోస్టుమార్టం నిర్వహించిన పార్టీ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య పార్టీ నిర్ణయానికి వ్యతిరేకంగా ఓటు వేసి బాధ్యత రాహిత్యంగా ప్రవర్తించారంటూ రెండు మిద్దెల జయ(2వ వార్డు), యాచమనేని శ్రీనివాసరావు(11వ వార్డు), జడల లక్ష్మి(5వ వార్డు), మధు రాజేందర్ శర్మ(23వ వార్డు), ముప్పిడి సునంద(26వ వార్డు)లను బీఆర్‌ఎస్ పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. పార్టీ ఆదేశాలకు వ్యతిరేకంగా వ్యవహరించిన మిగతా వారిపై సైతం క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని ఆయన ప్రకటించారు. అయితే ఈ ఐదుగురు కౌన్సిలర్లు టీఆర్‌ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీలో చేరే అవకాశం ఉందని భావించి వారిని పార్టీ నుంచి ఆగమేఘాలపై సస్పెండ్ చేసినట్లు భావిస్తున్నారు. ఇదిలా ఉండగా టీఆర్‌ఎస్ పార్టీకి తామే రాజీనామా చేస్తున్నామని మున్సిపల్ కౌన్సిలర్లు యాచమనేని శ్రీనివాసరావు, మధు రాజేందర్ శర్మ, జడల లక్ష్మి, ముప్పిడి సునంద ప్రకటించారు. వైస్ చైర్మన్ ఎన్నిక విషయంలో పార్టీ కౌన్సిలర్ల నుండి అభిప్రాయాలు సేకరించలేదని, అభ్యర్థి ఎంపిక విషయంలో కనీస విధివిధానాలు పాటించలేదని వారు ఆరోపించారు. ఏకపక్ష విధానాలతో వ్యవహరిస్తూ పార్టీని భ్రష్టు పట్టిస్తున్న తీరుకు నిరసనగా తాము బీఆర్‌ఎస్ పార్టీకి రాజీనామా చేస్తున్నామని వారు ప్రకటించారు. మొత్తం మీద అసెంబ్లీ ఎన్నికలకు కొద్దిరోజుల ముందు నుంచి ప్రారంభమైన రాజీనామాలు, వలసలు రోజురోజుకు పెరుగుతుండడం బీఆర్‌ఎస్ పార్టీ నాయకత్వాన్ని కలవరపెడుతోంది. టీఆర్‌ఎస్ పార్టీలోని మరికొందరు కౌన్సిలర్లు సైతం ఆ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరడానికి ప్రయత్నాలు చేస్తున్నారని, అందుకు అనుగుణంగా కాంగ్రెస్ నాయకత్వంతో సంప్రదింపులు జరుపుతున్నారని స్థానిక రాజకీయ వర్గాలలో జోరుగా చర్చ సాగుతోంది.

తాట్లవాయి హత్యపై వీడిన మిస్టరీ?

● పోలీసుల అదుపులో నిందితుడు? ● కత్తి, సెల్‌ఫోన్ స్వాధీనం

రాయికల్, ఫిబ్రవరి 9: మండలంలోని తాట్లవాయి గ్రామానికి చెందిన నాగెల్లి సురేష్(24) అనే యువకుడి హత్య మిస్టరీని పోలీసులు శనివారం ఛేదించినట్లు తెలిసింది. ఈ హత్యకు పాత కక్షలే కారణమని, హత్యకు పాల్పడిన వ్యక్తి పోలీసులకు తెలిపినట్లు సమాచారం. శుక్రవారం రాత్రి సెల్‌ఫోన్ సిగ్నల్ ఆధారంగా నిందితుని ఆచూకీ తెలుసుకున్న పోలీసులు సదరు వ్యక్తిని అదుపులోకి తీసుకుని హత్య మిస్టరీని ఛేదించినట్లు తెలిసింది. పోలీసుల అదుపులో ఉన్న సదరు వ్యక్తి ఇచ్చిన సమాచారం మేరకు హత్యకు ఉపయోగించిన కత్తి, నిందితుడి సెల్‌ఫోన్‌ను హతుడి వ్యవసాయ బావిలో నుంచి పోలీసులు శనివారం బయటకు తీసినట్లు సమాచారం. ఈ హత్యకు పాల్పడిన వ్యవహారంలో ఎందరి పాత్ర ఉందోనని పోలీసులు కూపీ లాగుతున్నట్లు తెలుస్తోంది.

మహిళ దారుణ హత్య

● నిందితుల కోసం పోలీసుల గాలింపు


మల్లవ్వ (ఫైల్)

వీర్నపల్లి, మార్చి 9: వీర్నపల్లి మండలం వన్‌పల్లి గ్రామానికి చెందిన శివరాత్రి మల్లవ్వ (42)ను ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు అర్ధరాత్రి ద్విచక్ర వాహనంపై వచ్చి హతమార్చినట్లు భావిస్తున్నారు. డాగ్‌స్క్వాడ్‌లు సైతం పసిగట్టని విధంగా మహిళ మృతదేహంతో పాటు ఇంటి పరిసరాల్లో కారంపొడి చల్లి దుండగులు పరారయ్యారు. కిరాతక హత్యకు వివాహేతర సంబంధమే కారణమని పలువురు భావిస్తున్నారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించిన డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి, సీఐ శ్రీనివాస్‌గౌడ్ తెలిపిన కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన మల్లవ్వ కొంతకాలం క్రితం భర్తతో విడాకులు తీసుకుని తల్లిగారి ఇంటి వద్ద ఉంటోంది. ఇద్దరు కుమారుల్లో ఒకరు రెండేళ్ల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా మరో కుమారుడు శేఖర్ తంగళ్లపల్లిలో కూలి పని చేసుకుంటూ నివాసం ఉంటున్నాడు. తల్లిగారి ఇంటి వద్ద ఒంటరిగా నివాసం ఉంటున్న మల్లవ్వను శుక్రవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు పథకం ప్రకారం అత్యాచారం చేసి హత్య చేసినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దుండగులు ఇద్దరు అర్ధరాత్రి పూట రోడ్డుపై వెళ్తున్న ఓ వ్యక్తిని మల్లవ్వ వివరాలు అడిగినట్లు సమాచారం. అర్ధరాత్రి ఒంటరిగా ఇంట్లో నివసిస్తున్న మల్లవ్వను గొంతుకోసి దారుణంగా హత్య చేశారు. ఇంట్లో వస్తువులు చిందరవందరగా పడి ఉండడంతో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మల్లవ్వను హత్య చేసిన దుండగులు శరీరంపై కారం చల్లి ఆనవాళ్లు గుర్తు పట్టరాకుండా చేసి పరారయ్యారు. శనివారం ఉదయం అటుగా వచ్చిన గ్రామస్థులు మల్లవ్వ మృతదేహాన్ని గమనించి పోలీసులకు, కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు, క్లూస్ టీం, డాగ్‌స్క్వాడ్‌తో పూర్తి వివరాలు సేకరిస్తున్నారు. నిందితుల కోసం ఎల్లారెడ్డిపేట ఎస్ఐ రమాకాంత్, వీర్నపల్లి ఎస్ఐ రమేష్, ఆర్ఎస్ఐలు జునైద్, సాయికిరణ్, పోలీస్ ప్రత్యేక బృందం గాలింపు కొనసాగిస్తోంది. మృతురాలి తమ్ముడు రాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రమేష్ తెలిపారు.

మెడికల్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ మహాసభలు

సుభాష్‌నగర్, మార్చి9: జిల్లా కేంద్రంలోని పద్మశాలి కల్యాణ మండపంలో తెలంగాణ మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ 5వ రాష్ట్ర మహాసభలను ప్రముఖ వైద్య నిపుణుడు డాక్టర్ విజయేందర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెడికల్ రిప్రజెంటేటివ్స్ చేస్తున్న న్యాయమైన పోరాటాలకు తన సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు.మందులపై ధరలను తగ్గించాలని, జీఎస్టీని తొలగించాలని, నాసిరకం మందులను అరికట్టాలన్నారు. అలాగే ఆన్‌లైన్‌లో మందుల అమ్మకాలను నిషేధించాలని మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ చేస్తున్న పోరాటాలను ఆయన కొనియాడారు. అనంతరం ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ అసోసియేషన్ పూర్వ ప్రధాన కార్యదర్శి కె.వేణుగోపాల్ మాట్లా డుతూ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను ఖండించారు. ఫెడరేషన్ ఆఫ్ మెడికల్ రిప్రజెంటేటివ్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు కె రమేశ్‌సుందర్ మాట్లాడుతూ సేల్స్ ప్రమోషన్ ఎంప్లాయీస్ ఆక్ట్-1976ను పరిరక్షించాలన్నారు. మెడికల్ రిప్రజెంటేటివ్స్‌లకు చట్టబద్ధమైన పనివిధానాలను కల్పించాలని, నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కోరారు. కరీంనగర్ ఐఎంఏ కార్యదర్శి డాక్టర్ వెంకట్‌రెడ్డి మాట్లా డుతూ ఫార్మా రంగంలో జరుగుతున్న అనైతిక కార్యక్రమాలను ఉమ్మడి పోరాటాలతో అరికట్టాలన్నారు. అనంతరం తెలంగాణ మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజు భట్ మాట్లాడుతూ ఆన్‌లైన్‌లో మందుల అమ్మకాలను నిలిపి వేయాలని కోరారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేశ్ మాట్లాడుతూ కరోనా కాలంలో మెడికల్ రిప్రజెంటేటివ్స్ చేసిన సేవలను కొనియాడారు. ఈ మహాసభలో ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ నాయకుడు రాంమోహన్, ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ నాయకుడు సత్యనారాయణరెడ్డి, డీవైఎఫ్ఐ నాయకుడు తిరుపతి, ఐద్వా నాయకురాలు నాగమణి, జనవిజ్ఞాన వేదిక నాయకుడు రామరాజు, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ నాయకుడు స్వామి, రాజు, రాజమల్లు, సురేష్, రాజేశం, ఎఫ్ఎంఆర్ఏఐ సహాయ ప్రధాన కార్యదర్శి సునీల్‌కుమార్, టీఎంఎస్ఆర్‌యూ అధ్యక్షుడు భానుకిరణ్, సహాయ కార్యదర్శి నాగేశ్వర్, కోశాధికారి దుర్గాప్రసాద్, కార్యదర్శులు సిహెచ్ శ్రీధర్, సదానందచారి, కె ఐలయ్య, సయ్యద్‌సిద్ధిక్, ఎం అంజయ్య పాల్గొన్నారు.

వెళ్లొస్తాం..రాజన్నా

● వేములవాడలో ముగిసిన మహాశివరాత్రి జాతర ● తిరుగు ముఖం పట్టిన భక్తులు


వేములవాడ నుంచి తిరిగి వెళ్తున్న భక్తులు

వేములవాడ మార్చి 9: 'ఆపదమొక్కుల రాజన్న దయ ఉంచు.. వచ్చే సంవత్సరం జాతరకు మళ్లీవస్తాం' అంటూ రాజరాజేశ్వర స్వామి భక్తులు వేములవాడ నుంచి తిరుగు ముఖం పట్టారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలోని వేములవాడ రాజరాజేశ్వరస్వామి దివ్యక్షేత్రంలో మహాశివరాత్రి జాతర ఉత్సవాల కోసం వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చిన భక్తులు ఇళ్లకు తిరిగి వెళ్లారు. గురువారం ప్రారంభమైన ఉత్సవాలు మూడు రోజులపాటు ఘనంగా నిర్వహించారు. చివరి రోజు శనివారం ఉత్సవాలు ప్రశాంతంగా ముగిశాయి. శుక్రవారం రాత్రి జాగరణ పాటించిన భక్తులు తెల్లవారుజామునే ఉపవాసం విడిచారు. పలువురు భక్తులు నిలువెత్తు బంగారం సమర్పించుకున్నారు. అనుబంధాలయమైన బద్ది పోచమ్మ ఆలయంలో అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు.

అభిషేక పూజలో మంత్రి, ప్రముఖులు

మహా శివరాత్రి సందర్భంగా రాజరాజేశ్వర స్వామి వారి దేవస్థానంలో శుక్రవారం అర్ధరాత్రి లింగోద్భవ సమయంలో నిర్వహించిన మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం పూజలో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. గత రెండు దశాబ్దాలకు పైగా ప్రతి సంవత్సరం మహాశివరాత్రి పర్వదినం రోజున రాజరాజేశ్వర స్వామి వారి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం పూజలో పాల్గొంటున్న మంత్రి పొన్నం ప్రభాకర్ శుక్రవారం రాత్రి ప్రభుత్వ విప్‌లు ఆది శ్రీనివాస్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌లతో కలిసి పాల్గొన్నారు. ఐఏఎస్ అధికారులు కృష్ణభాస్కర్, లక్ష్మీ పార్థసారథి, ఎస్పీ అఖిల్ మహాజన్, ట్రైనీ ఎస్పీ రాహుల్ రెడ్డి, జిల్లా పరిషత్ అధ్యక్షురాలు న్యాలకొండ అరుణ, మున్సిపల్ చైర్ పర్సన్ రామతీర్థపు మాధవి తదితరులు లింగోద్భవ పూజలో పాల్గొన్నారు.

అనంతరం శనివారం తెల్లవారుజామున వీరికి అర్చకులు ఆశీర్వచనం గావించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈవో డి కృష్ణప్రసాద్, ఏఈఓ హరికిషన్, ఆర్డీఓ రాజేశ్వర్, డీఎస్పీ నాగేంద్రచారి తదితరులు పాల్గొన్నారు.

జాతర విజయవంతం : విప్ ఆది శ్రీనివాస్

అందరి సహకారం, సమన్వయంతో మహాశివరాత్రి జాతర విజయవంతమైందని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ అన్నిశాఖల అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధుల సమన్వయంతో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడగలిగామని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం నాలుగున్నర కోట్ల రూపాయల అంచనా వ్యయంతో ప్రత్యేక చర్యలు చేపట్టి భక్తులకు సౌకర్యాలు కల్పించిందన్నారు. జాతర విజయవంతంగా జరగడానికి రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఎంతో సహకరించారని, జాతర ఏర్పాట్లపై పలు సూచనలు, సలహాలు అందజేశారని తెలిపారు. క్షేత్ర స్థాయిలో ఉంటూ పర్యవేక్షణ చేసిన స్థానిక ప్రజాప్రతినిధులు, కలెక్టర్ అనురాగ్ జయంతి, ఎస్పీ అఖిల్ మహాజన్, ఆలయ ఈఓ కృష్ణ ప్రసాద్, ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులకు విప్ ధన్యవాదాలు తెలియజేశారు. ఆర్టీసీ సంస్థ దాదాపు 400 బస్సులను కేటాయించి 3వేల ట్రిప్పులు నడిపిందని అన్నారు. దాదాపు 3 లక్షలకు పైగా మంది భక్తులు తరలి వచ్చి రాజన్నను దర్శించుకున్నారని వివరించారు.

జాతర సందర్భంగా రాజన్న ఆలయ ఆర్జిత సేవల ద్వారా తొలిరోజు ఏడవ తేదీ 24 లక్షల 22 వేల 392 రూపాయలు, రెండవ రోజు ఎనిమిదవ తేదీ 74 లక్షల 6 వేల 600 రూపాయల ఆదాయం సమకూరిందని ఈవో డి కృష్ణప్రసాద్ తెలిపారు.


వేములవాడలో మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ప్రసాదం అందజేస్తున్న అర్చకులు



దుబ్బరాజన్న ఆలయంలో అన్నప్రసాద అలంకరణలో స్వామివారు, భక్తులు

భక్త జనంతో కిక్కిరిసిన దుబ్బరాజన్న క్షేత్రం

సారంగాపూర్, మార్చి 9: మండలంలోని శ్రీ దుబ్బ రాజన్న క్షేత్రం భక్తజనంతో కిక్కిరిసి పోయింది. మహా శివరాత్రి ఉపవాసాలతో జాగరణ చేసిన భక్తులు ఉదయాన్నే కోనేరులో స్నానాలు ఆచరించి ఆలయానికి చేరుకున్నారు. క్యూలైన్‌లో నిలబడి స్వామి వార్లను దర్శించుకున్నారు. భక్తులు గండదీపం, కోడెమొక్కులు, తలనీలాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. శనివారం స్వామి వార్లకు అన్న ప్రసాదం, హారతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆదివారం ఉదయం రథోత్సవ కార్యక్రమం ఉంటుంది. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు చేస్తున్నారు.

ధర్మపురిలో రాజేశ్వరుడి రథోత్సవం

ధర్మపురి, మార్చి 9: ధర్మపురి క్షేత్రంలో శ్రీ అక్కపల్లి రాజ రాజేశ్వర స్వామి, శ్రీ రామ లింగేశ్వరస్వామి, నేరెళ్ల, జైనాలో శ్రీసాంబ శివుని రథోత్సవాలు శనివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం ఆలయ వేద పారాయణదారు పాలెపు ప్రవీణ్‌శర్మ, ఆలయ అర్చకులు ద్యావళ్ల విశ్వనాథశర్మ, జన్మంచి శ్రీనివాస్, ఆధ్వర్యంలో వేద మంత్రాల మధ్య శివ పార్వతుల ఉత్సవ మూర్తులను రథాలపై ఆశీనులు చేశారు. అనంతరం శ్రీ అక్కపెల్లి ఆలయం నుంచి నంది విగ్రహ చౌరస్తా వరకు రథాన్ని ఊరేగించారు. శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో శివ పార్వతుల కళ్యాణం జరిపారు. జైనాలో స్వామివారల సేవను ఊరేగించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్యమ్మ తదితరులు పాల్గొన్నారు.


ధర్మపురి శ్రీ అక్కపెల్లి రాజరాజేశ్వర స్వామి రథోత్సవం

నకిలీ సర్టిఫికెట్ల ముఠా గుట్టు రట్టు

● నలుగురు నిందితుల అరెస్టు ● పరారీలో మరో ఇద్దరు

జగిత్యాల, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతీ యువకులకు నకిలీ సర్టిఫికెట్లు విక్రయిస్తూ రూ. లక్షలు గడిస్తున్న ఓ అంతర్రాష్ట్ర ముఠా గుట్టును జగిత్యాల పోలీసులు రట్టు చేశారు. ఈ వ్యవహారంలో నలుగురు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పశ్చిమబెంగాల్‌కు చెందిన మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నారు. పట్టుబడ్డ వారి వద్ద వివిధ విశ్వ విద్యాలయాలు, బోర్డుల పేరిట సృష్టించిన 395 నకిలీ సర్టిఫికెట్లు, ఒక కంప్యూటర్, ఒక ల్యాప్ టాప్, ఇతర సామగ్రిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. జగిత్యాల పట్టణంలోని పోలీసు ప్రధాన కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ వివరాలను వెల్లడించారు. జగిత్యాల జిల్లా ధర్మపురి మండలం జైనా గ్రామానికి చెందిన కొడితెల మహేశ్ అనే యువకుడు ఇటీవల గల్ఫ్ దేశం వెళ్లడానికి పాస్ పోర్టు కోసం ప్రయత్నం చేశాడు. పాస్‌పోర్టు దరఖాస్తుతో జతపరచడానికి పదో తరగతి సర్టిఫికెట్ అవసరం కావడంతో అదే గ్రామానికి చెందిన కొక్కరకాని చంద్రయ్య అలియాస్ చందును సంప్రదించాడు. తన సమీప బంధువు అయిన కరీంనగర్‌కు చెందిన బత్తినోజు రజిత, బత్తినోజు శ్రావణ్ కుమార్‌లు ఎవరికి అనుమానం రాకుండా నకిలీ సర్టిఫికెట్లు ఇస్తారని మహేశ్‌కు చంద్రయ్య సమాచారం అందించాడు. దీంతో చంద్రయ్య సహాయంతో మహేశ్ కరీంనగర్‌లోని రజిత, శ్రావణ్ కుమార్‌లను సంప్రదించగా రూ. 28 వేలకు ఒప్పందం కుదుర్చుకొని నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఓపెన్ స్కూల్, రూల్ నంబరు (16007125873) గల ఓపెన్ ఎస్ఎస్‌సీ నకిలీ సర్టిఫికెట్‌ను అందించారు. సదరు సర్టిఫికెట్‌తో పాస్‌పోర్టు కోసం మహేశ్ దరఖాస్తు చేసుకున్నాడు. ధర్మపురి స్పెషల్ బ్రాంచ్ హెడ్ కానిస్టేబుల్ నర్సింగ్ రావు జరిపిన విచారణలో అది నకిలీ సర్టిఫికెట్‌గా గుర్తించారు. ఈ వ్యవహారాన్ని స్పెషల్ బ్రాంచ్ పోలీసులు జగిత్యాల పోలీసు ఉన్నతాధికారులకు వివరించడంతో ఎస్పీ ఆదేశాల మేరకు ధర్మపురి పోలీసులు పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. అనంతరం మరింత లోతుగా విచారణ జరపడంతో మరిన్ని వివరాలు వెలుగులోకి వచ్చాయి. కరీంనగర్‌కు చెందిన రజిత, శ్రావణ్ దంపతులు సులభంగా డబ్బులు సంపాదించాలన్న ఆశతో తమకు జస్ట్ డయల్ ద్వారా పరిచయమైన పశ్చిమ



నిందితుల అరెస్టును చూపుతున్న ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్

బెంగాల్‌కు చెందిన రబీరాయ్, లక్ష్మీరాయ్‌ల సహాయంతో సుమారు ఐదేళ్లుగా నకిలీ సర్టిఫికెట్లు విక్రయిస్తున్నట్లు పోలీసులు తేల్చారు. పదో తరగతి, ఇంటర్ సర్టిఫికెట్‌కు రూ. 30 వేలు, డిగ్రీ సర్టిఫికెట్‌కు రూ. 40 వేలు, ఇంజనీరింగ్ సర్టిఫికెట్‌కు రూ.50 నుంచి రూ.60 వేలు వసూలు చేస్తూ కోరుకున్న సంవత్సరంలో కోరుకున్న పేరు మీద సూచించిన యూనివర్సిటీ, బోర్డుల పేరిట సృష్టించి విక్రయిస్తున్నట్లుగా గుర్తించారు. సుమారు ఐదేళ్ల కాలంలో సుమారు 395 నకిలీ సర్టిఫికెట్లు విక్రయించి సుమారు రూ. 15.41 లక్షలు వసూలు చేసినట్లుగా పోలీసుల విచారణలో వెలుగులోకి వచ్చింది. ఈనేపథ్యంలో కరీంనగర్‌లోని రాంనగర్ కాలనీలో సొంతిట్లో నివాసమున్న బత్తినోజు రజిత, బత్తినోజు శ్రావణ్ కుమార్‌లను, జగిత్యాల జిల్లా ధర్మపురి మండలం జైన గ్రామంలోని నివాసంలో కొడిచాల మహేశ్, కొక్కరకాని చంద్రయ్య అలియాస్ చందులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద 395 నకిలీ సర్టిఫికెట్లు, 5 మొబైల్ ఫోన్లు, రూ. 25 వేల నగదు, ఒక ల్యాప్ టాప్, ఒక కంప్యూటర్ సీపీయూ, ఒక ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితులైన పశ్చిమబెంగాల్ రాష్ట్రంలోని బరహంపూర్‌కు చెందిన రబీరాయ్, లక్ష్మీరాయ్‌లు పరారీలో ఉన్నట్లు వివరించారు.

ఆర్టీసీ ఉద్యోగులకు పీఆర్‌సీ ప్రకటించడం హర్షణీయం

కరీంనగర్ టౌన్, మార్చి 9: టీఎస్ ఆర్టీసీ ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం 21శాతం పీఆర్‌సీ ప్రకటించడం హర్షణీయమని ఐఎన్‌టీయూసీ అనుబంధ ఎస్‌డబ్ల్యూయు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపింది. యూనియన్ రాష్ట్ర నాయకుడు సయ్యద్ మహమూద్, రాజిరెడ్డి కృషి ఫలితమేనని ఐఎన్‌టీయూసీ రాష్ట్ర వైస్ చైర్మన్, చీఫ్ ఎగ్జిక్యూటివ్ జక్కుల మల్లేశం గౌడ్, రీజినల్ అధ్యక్ష, కార్యదర్శులు టీఆర్‌రెడ్డి, ఎన్‌కె రాజు మంత్రి పొన్నం ప్రభాకర్‌కు , ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

ముస్తాబాద్, మార్చి 9: మండలంలోని కొండాపూర్ గ్రామానికి చెందిన చిగురు యాదయ్య (54) విద్యుదాఘాతంతో మృతి చెందారు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. యాదయ్య అనే రైతు తన పొలానికి సరఫరా అయ్యే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ రెండు నెలలుగా ఫ్యూజ్ వైరు పడిపోతుంది. దీంతో పొలానికి నీరు సరిగా అందక పోవడంతో శుక్రవారం రాత్రి ఫ్యూజ్ వైరు సరిచేయాలని యాదగిరి ట్రాన్స్‌ఫార్మర్ బంద్ చేసి ఫ్యూజ్ వైరు సరిచేసే క్రమంలో విద్యుదాఘాతంతో కిందపడిపోయాడు. గమనించిన చుట్టు పక్కల రైతులు ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో యాదగిరి మృతిచెందాడు. సెస్ అధికారులు పట్టించుకోకపోవడంతోనే ఈ ఘటన చోటు చేసుకుందని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. యాదగిరికి భార్య లక్ష్మీ, కూతుళ్లు దేవలక్ష్మీ, రమణ, కొడుకులు శేఖర్, రమేశ్ ఉన్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అతిపెద్ద జాతీయజెండా ఏర్పాటు చేయడం అభినందనీయం

రామడుగు, మార్చి 9: గ్రామీణ ప్రాంతాల్లో అతిపెద్ద జాతీయజెండా ఏర్పాటు చేయడం అభినందనీయమని, భారతదేశ ఔన్నత్యం, ఆశయాలకు జాతీయజెండా ప్రతిరూపమని ఎంపీ, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ కుమార్ అన్నారు. మండలంలోని గోపాల్‌రావుపేటలో జాతీయజెండాను శనివారం చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోని నేచర్ యూత్‌క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 56ఫీట్ల అతిపెద్ద జాతీయ జెండాను గ్రామీణ ప్రాంతాలలో ఏర్పాటు చేయడం సంతోషదాయకమన్నారు. 77ఏళ్లుగా జాతీయజెండా దేశ ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటి చెప్పిందన్నారు. జాతీయ జెండాలో మహాత్మాగాంధీ, సుభాష్‌చంద్రబోష్, భగత్‌సింగ్, సావర్కర్ వంటి వారు స్వాతంత్ర్యం కోసం ఉద్యమించిన నేతల త్యాగాలు గుర్తుకు వస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ మండలంలోని గోపాల్‌రావుపేటలోని నేచర్ యూత్‌క్లబ్ ఆధ్వర్యంలో అతిపెద్ద జాతీయ జెండా దేశం గర్వించేలా ఏర్పాటు చేయడం శుభపరిణామం అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభక్క, సంఘం అధ్యక్షులు కాసారపు పరుశరాములు, గ్రామస్థులు పాల్గొన్నారు.


జాతీయజెండాకు వందనం చేస్తున్న ఎంపీ బండి సంజయ్, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



కొండగట్టు ఘాట్‌రోడ్డుపై పర్యవేక్షణ ఏదీ?

● ఓవర్‌లోడ్‌తో ప్రయాణాలు.. పట్టించుకోని అధికారులు

మల్యాల, మార్చి 9: కొండగట్టు ఘాట్‌రోడ్డుపై రవాణా, పోలీసు ఇతర శాఖల అధికారుల పర్యవేక్షణ కరువైందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నిత్యం పర్యవేక్షణ చేయాల్సిన అధికారులు ఇటు వైపు కన్నెత్తి చూడడం లేదని స్థానికులు అంటున్నారు. దీంతో వాహనాల ఓవర్‌లోడ్, అతి వేగం తదితర నిబంధనలు విస్మరిస్తుండడంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. అయిదేళ్ల క్రితం ఘాట్‌రోడ్డుపై ఆర్టీసీ బస్సు ప్రమాదంలో 67 మంది వరకు మృత్యువాత పడ్డారు. ఈ ప్రమాదం అనంతరం ప్రస్తుత ఘాట్ రోడ్డును మూసివేసి వాహనాల రాకపోకలను నిషేధించారు. రెండు సంవత్సరాల క్రితం నిబంధనలతో కూడిన షరతులతో వాహనాల రాకపోకలను ప్రారంభించిన అధికారులు పలు శాఖల అధికారులు పర్యవేక్షణ చేయాలనే ఈఎన్‌సీ ఆదేశాలను పాటించడం లేదు. ఈ ఘాట్ రోడ్డుపై జరిగిన ప్రమాదాల్లో ఇప్పటి వరకు 150మందికి పైగానే భక్తులు దుర్మరణం చెందగా, వందలాదిగా గాయాలపాలయ్యారు. ప్రస్తుతం ఉన్న ఘాట్ రోడ్డు 1.2 కి.మీ. ఉండగా, గతంలో జరిగిన ప్రమాదాలు దృష్ట్యా, నిబంధనల మేరకు మలపులతో కూడుకొని ఘాట్‌రోడ్డు 2.5 కి.మీ.ఉంటేనే రాకపోకలకు అనుకూలమని ఇంజనీరింగ్ అధికారులు మరో ఘాట్‌రోడ్ కోసం సర్వే చేసి కొత్త రోడ్డుకు 3.6 కి.మీ మేర ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ప్రభుత్వానికి నివేదించారు. అయితే ఇంత వరకు ఆ ప్రతిపాదనలపై చర్యలు కనిపించడం లేదు. 2018 సెప్టెంబర్ 11న కొండగట్టు ఘాట్‌రోడ్డుపై జరిగిన ప్రమాద అనంతరం రాకపోకలను నిషేధించిన అధికారులు 2022 జూన్27న నిబంధనలతో కూడిన అనుమతులు ఇచ్చారు. 20స్పీడ్ లోపే వాహనాలను నడుపాల్సి ఉంటుంది. కండీషన్ గల కార్లు, ఆటోలు, ద్విచక్రవాహనాలకు మాత్రమే అనుమతి ఉంటుంది. భారీ వాహనాలైన బస్సులు, లారీలు, మినీబస్సులు, ట్రాక్టర్లు, ట్రాలీ ఆటోలకు అనుమతి లేదు. ఓవర్‌లోడ్(ప్రయాణికులు, ఇతరాత్ర)తో వచ్చే ఎలాంటి వాహనాలకు అనుమతి ఉండదు. కిందకు వచ్చే వాహనాలు గేరులోనే రావాలి. న్యూట్రల్‌లో రాకూడదనే నిబంధనలున్నాయి.


ప్రమాదకరంగా ఉన్న కొండగట్టు ఘాట్‌రోడ్డు

ఘాట్‌రోడ్డుపై ఆటో బోల్తా - 11మందికి గాయాలు

కొండగట్టు ఆంజనేయస్వామి దర్శనానికి వచ్చిన మంచిర్యాల జిల్లా లక్సెట్టిపేట మండలం మ్యాదరిపేటకు చెందిన గందం జగన్ కుటుంబ సభ్యులు ప్రయాణిస్తున్న ట్రాలీ ఆటో శనివారం ఘాట్‌రోడ్డుపై బోల్తా పడింది. ఆటోలో ఉన్న 12 మందిలో 11మందికి గాయాలయ్యాయి. మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. అంజన్న దర్శనం అనంతరం తిరుగు ప్రయాణంలో ఘాట్‌రోడ్డు మీదుగా కొండ దిగుతుండగా అదుపు తప్పిన ఆటో బోల్తాపడడంతో ప్రమాదం చోటు చేసుకుంది. ఆటోలో గల అర్వింద్, చంద్రయ్య, రాజేష్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. ఆటోలో పరిమితికి మించి ఉండడం, న్యూట్రల్‌లో రావడంతోనే ఆటో అదుపు తప్పినట్లు సంఘటన స్థలాన్ని బట్టి తెలుస్తోంది. గాయపడిన వారంద రినీ చికిత్స కోసం జగిత్యాల ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై అబ్దుల్ రహీం తెలిపారు.

ఆర్టీసీ ఉద్యోగుల సంబరాలు

కళ్యాణ్‌నగర్, మార్చి 9: ప్రభుత్వం టీఎస్‌ఆర్టీసీ ఉద్యోగులకు 2017సంవత్సరానికి సంబంధించి 21శాతం పీఆర్‌సీని ప్రకటించడంపై హర్షం వ్యక్తం చేస్తూ శనివారం గోదావరిఖని ఆర్‌టీసీ డిపోలో ఉద్యోగులు సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డిపో మేనేజర్ నాగభూషణం హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఆర్‌టీసీ ఉద్యోగులకు పీఆర్‌సీ ప్రకటించడం హర్షనీయమన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, టీఎస్ ఆర్‌టీసీ ఎండీ సజ్జనార్‌కు ఆయన కృతజ్ఞతలుతెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ గీతకృష్ణ, అసిస్టెంట్ ఇంజనీరింగ్ (మెకానికల్) సంధ్యారాణి, ఎంప్లాయిస్ వెల్ఫేర్ బోర్డు సభ్యులు పీకే స్వామి, ఇందిరాదేవితో పాటు ఉద్యోగులు పాల్గొన్నారు.

నేత్రదానం

కళ్యాణ్‌నగర్, మార్చి 9: గోదావరిఖని కళ్యాణ్‌నగర్‌కు చెందిన కోరె సదానందం(47) శనివారం గుండెపోటుతో మృతిచెందగా ఆయన నేత్రాలను హైదరాబాద్ వాసన్ ఐ బ్యాంకు టెక్నీషియన్ ఆరీఫ్ సేకరించారు. సదానందం భార్య రమ్య, కూతురు రోషిణి, కుమారుడు రోషన్ నేత్రాలు దానం చేయడానికి ముందుకు రాగా, లయన్స్‌క్లబ్ ప్రతినిధులు రాజేందర్ వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్, సదాశయ ఫౌండేషన్ సభ్యులు బేణిగోపాల్ త్రివేది, రాజమౌళి, పవన్‌కుమార్, కేఎస్‌వాసు, భీష్మాచారి, అన్నపూర్ణ, చంద్రశేఖర్, శారద, శశికళ ఉన్నారు.

రేపు సుల్తానాబాద్ మున్సిపల్ సమావేశం

సుల్తానాబాద్, మార్చి 9: సుల్తానాబాద్ మున్సిపల్ పాలకవర్గం సమావేశం సోమవారం నిర్వహిస్తున్నట్లు కమీషనర్ వేణుగోపాల్ తెలిపారు. ప్రతిఏటా నిర్వహించే వార్షిక బడ్జెట్ సమావేశాన్ని సోమవారం ఉదయం పదకొండు గంటలకు నిర్వహించనున్నామని కౌన్సిలర్లు, సభ్యులు సకాలంలో హాజరుకావాలని ఆయన కోరారు. ఈ సమావేశానికి జిల్లా ఉన్నతాధికారి హాజరుకానున్నారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ గాజుల లక్ష్మీరాజమల్లు అధ్యక్షతన జరుగనున్న ఈ సమావేశంలో 2024-2025 వార్షిక ఆదాయ ఖర్చుల వివరాలను, చేపట్టనున్న పనుల వివరాలను చర్చించనున్నారు.

అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

పెద్దపల్లిటౌన్, మార్చి 9: ప్రపంచ ధరణి దినోత్సవం సందర్భంగా ఏప్రిల్ 24న సేంద్రియ వ్యవసాయ విధానంలో కృషి చేస్తున్న రైతులకు రాష్ట్రస్థాయిలో నేల నేస్తం అవార్డు అందించనున్నట్లు ధర్మపీఠం మానవ వికాస కేంద్రం సంస్థ వ్యవస్థాపకులు కుచన మల్లయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రతి జిల్లా నుంచి ఒకరికి జిల్లా స్థాయిలో నేల నేస్తం-2024 ప్రశంస పత్రం అందించనున్నట్లు తెలిపారు. అవార్డు కోసం రైతులు తమ వివరాలను జిల్లా వ్యవసాయ అధికారితో ధ్రువీకరించి నమోదు పత్రాన్ని మార్చి 29లోపు 7095026350 అనే ఫోన్ నంబరుకు వాట్సాప్ ద్వారా పంపించాలని కోరారు.

ఆత్మీయ సమ్మేళనానికి తరలిరండి

ఓదెల, మార్చి 9 : కరీంనగర్ జిల్లా కేంద్రంలో ఆదివారం ఉమ్మడి జిల్లా గౌడసంఘం ఐక్యవేదిక ఆత్మీయ సమ్మేళనానికి తరలిరావాలని గౌడ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బైరి రవిగౌడ్ కోరారు. మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌ను పార్లమెంటరీ కన్వీనర్‌గా ఎన్నుకోవడం జరిగిందని తెలిపారు.

మహిళా సిబ్బందికి సన్మానం

పాలకుర్తి, మార్చి 9: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఘన్ శ్యాందాస్ నగర్ పంచాయతీ మహిళా సిబ్బందిని శనివారం సన్మానించారు. పంచాయితీ కార్యాలయ ఆవరణలో గ్రామ ప్రత్యేక అధికారి సురేష్ అధ్యక్షతన ఏఎన్‌ఎంలను, ఆశావర్కర్లను, పంచాయతీ మహిళా సిబ్బందిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సూర సమ్మయ్య, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, కోఆప్షన్ సభ్యుడు భూమయ్య తదితరులు పాల్గొన్నారు.

బేస్‌బాల్ ట్రయల్స్‌కు విద్యార్థుల ఎంపిక

పాలకుర్తి, మార్చి 9: పాలకుర్తి మండల పరిధిలోని యూనివర్సల్ పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి బేస్‌బాల్ సెలక్షన్ ట్రయల్స్‌కు ఎంపికైనట్లు పాఠశాల కరస్పాడెంట్ మహ్మామ్మద్ ఇస్మాయిల్ తెలిపారు. ఈనెల 8 తేదీన గోదావరిఖని ప్రభుత్వ డిగ్రీ, పీజీ కాలేజీలో జరిగిన జిల్లా స్థాయి బేస్‌బాల్ ట్రయల్స్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి కరీంనగర్ అంబేద్కర్ స్టేడియంలో జరగబోయే రాష్ట్రస్థాయి ట్రయల్స్‌కు ఎంపికైనట్లు ఆయన పేర్కొన్నారు. బాలుర విభాగంలో సందీప్‌గౌడ్, మహాశివసాయి, సన్నీ, బాలికల విభాగంలో సంకీర్త, శరిష్మలు ఎంపికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులను పాఠశాల యాజమాన్యం అభినందించింది.

హుస్సేనిమియా వాగుపై హైలెవల్ బ్రిడ్జి నిర్మించేదెప్పుడో?

- శిథిలావస్థకు చేరిన లోలెవల్ వంతెన - వర్షాకాలంలో వాహనదారులకు తప్పని ఇబ్బందులు



శిథిలావస్థకు చేరిన హుస్సేనిమియావాగు లోలెవల్ బ్రిడ్జి



లోలెవల్ బ్రిడ్జిపై నుంచి ప్రవహిస్తున్న వరదనీరు(ఫైల్)

జూలపల్లి, మార్చి 9 : మండలంలోని వడుకాపూర్, ధూళికట్ట గ్రామాల సరిహద్దులో ప్రవహిస్తున్న హుస్సేనిమియా వాగుపై నిర్మించిన లోలెవల్ వంతెన శిథిలావస్థకు చేరింది. ఈ లోలెవల్ బ్రిడ్జిపై ప్రయాణం ప్రాణ సంకటంగా మారిందని వాహదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పెద్ద గుంతలు పడి, సైడ్‌వాల్ పిల్లర్లు దెబ్బతిని ఏళ్ల గడుస్తున్నా పట్టించుకునే వారే కరువయ్యారని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మార్గం గుండా వర్షాకాలంలో ప్రయాణించాలంటే తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోందని పేర్కొంటున్నారు. వరద ప్రవాహంతో హుసేమియావాగు లోలెవల్ బ్రిడ్జి మునిగిపోయి రోజుల తరబడి రాకపోకలు నిలిచిపోయి అవస్థలు పడుతున్నామని ప్రజలు పేర్కొంటున్నారు. వర్షాకాలంలో అత్యవసర పరిస్థితుల్లో కరీంనగర్‌కు వెళ్లాలంటే హుసేమియావాగు దాటలేక ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి హుస్సేనిమియా వాగుపై హైలెవల్ బిడ్జి నిర్మించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

మంథనిలో యథేచ్ఛగా బెల్టు షాపుల దందా

- అధిక రేట్లతో విక్రయాలు - పట్టించుకోని ఎక్సైజ్ శాఖ అధికారులు

మంథని, మార్చి 9: మంథని ప్రాంతంలో అధిక రేట్లకు మద్యం విక్రయాలు జోరుగా కొనసాగుతున్నాయి. మంథని పట్టణంలోని వార్డుల్లో, మండలంలోని అన్ని గ్రామాల్లో రాత్రిపగలు తేడా లేకుండా విచ్చలవిడిగా మద్యం బెల్టు షాపులు నిర్వహిస్తున్నారు. మంథని మద్యం వ్యాపారుల కనుసన్నల్లో మంథని పట్టణంలో, గ్రామాల్లో బెల్టు షాపుల దందా మూడు క్వర్టర్లు, ఆరు బీరులుగా జోరుగా నడుస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. నేరుగా షాపుల నుంచి ఆటోలు, ట్రాలీలు, టూవీలర్స్ ద్వారా ప్రతి రోజు పెద్ద ఎత్తున వివిధ బ్రాండ్ల మద్యం, బీరు బాటిళ్ల కాటన్లలను గ్రామాల్లోని బెల్టు షాపులకు తరస్తుండటంతో వారు అక్కడ అధిక రేట్లకు మద్యం విక్రయిస్తూ అందిన కాడికి దోచుకుంటున్నారు. బెల్టు షాపుల్లో అధిక ధరలకు మద్యం విక్రయాల కారణంగా మద్యం ప్రియులు జేబులకు తూట్లు పడుతున్నాయి. మంథని పట్టణం తోపాటు గ్రామాల్లో చిన్నచితక పనులు చేసుకునే కూలీలు చేసుకునే వారు తమ సంపాదనంత తాగుడికే ఖర్చు చేసుకునే పరిస్థితి కొనసాగుతోంది. మంథనిలోని శ్రీపాదచౌక్, జ్యోతిభాపూలే చౌక్, పాత పెట్రోల్‌పంపు, హనుమాన్ నగర్‌లోని ప్రధాన రహదారి పక్క షాపులు, ఇండ్లలో, మున్సిపల్ పరిధిలోని బోయినిపేట, గంగాపురి పలు వార్డుల్లో, గ్రామాల్లో 3 నుంచి 5 వరకు బెల్టుషాపులు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. చాలావరకు కిరాణ, కూల్‌డ్రింక్, ఇతర చిన్నషాపుల పేరిట నివాసాల మధ్యనే 24 గంటల పాటు బెల్టు షాపులు నిర్వహిస్తున్నారు. దీంతో గ్రామాల్లో, పట్టణంలో చాలా మంది విద్యార్థులు, యువత మద్యం ప్రియులుగా మారుతున్నారు. తాగడం కారణంగా గొడలు, అకారణంగా ఇతరులను దూషించడం, మద్యం మత్తులో నానా హంగామా సృష్టిస్తున్నారు. గ్రామాల్లో, మంథని పట్టణంలో విచ్చలవిడిగా మద్యం విక్రయాలు అధిక ధరలకు కొనసాగుతున్న, మద్యం మత్తులో వివిధ రకాల గొడవలు జరుతున్న ఇటు ఎక్సైజ్, ఆటు పోలీసు శాఖ అధికారులు పట్టించుకున్న పాపాన పోవడం లేదు. వీటిన వారు మాములుగానే చూస్తున్నట్లు బహిరంగానే ప్రజలు ఆరోపిస్తున్నారు.

ఇప్పటికైనా ఎక్సైజ్, పోలీసు శాఖల అధికారులు స్పందించి విచ్చలవిడి బెల్టు షాపుల నిర్వాహణ, అధిక ధరలకు మద్యం విక్రయాలకు కళ్లెం వేయాలని ప్రజలు కోరుతున్నారు.

బ్రహ్మోత్సవాలకు ఆలయం ముస్తాబు

సుల్తానాబాద్, మార్చి 9: సుల్తానాబాద్ పట్టణంలోని శ్రీసంతాన వేణుగోపాలస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 18 నుంచి ప్రారంభమవుతాయని ఛైర్మన్ పల్లా మురళీధర్ తెలిపారు. ఆలయ ఆవరణలో ఉన్న భవానిశంకర శివాలయాన్ని కూడా ముస్తాబు చేస్తున్నారు. ఐదు రోజులపాటు జరిగే ఈ బ్రహ్మోత్సవాల్లో హోమాలు నిర్వహించేందుకు యాగశాల నిర్మాణం చేస్తున్నారు. ఈనెల 20న శ్రీరుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాల స్వామి కల్యాణోత్సవం జరుగుతుందని, భక్తులు పెద్దఎత్తున పాల్గొనాలని కోరారు.

భక్తులకు అన్నదానం

పెద్దపల్లి రూరల్, మార్చి 9 : మండలంలోని పెద్ద బొంకూర్‌లో శనివారం శివపార్వతుల కల్యాణం సందర్భంగా అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ ఛైర్మన్ మిట్టపల్లి శ్రీనివాస్, కారుపాకల జంపయ్య, సీపెల్లి శ్రీనివాస్, కలవేనరవి, సంపత్, కృష్ణమాచారి, నాగరాజు, రవిశాస్త్రి, శ్రీనివాస్, భిక్షపతి, రమేష్, బాలు, అనిల్, అశోక్, శ్రావణ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లో ఇబ్బందులు కలగకుండా చర్యలు

- సన్మాన సభలో పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న సహకార సంఘం ఛైర్మన్, సభ్యులు

ఓదెల, మార్చి 9 : నియోజకవర్గంలో కొనసాగే ధాన్య కొనుగోలు కేంద్రాల్లో ఇకనుంచి ఏ రైతులకు కూడా ఎలాంటి ఆటంకాలు ఉండవని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. మండలంలోని పొత్కపల్లి వ్యవసాయ సహకార సంఘం కమిటీ ఆధ్వర్యంలో శనివారం సన్మాన సభను నిర్వహించారు. ఇటీవల ఏకగ్రీవంగా ఎన్నికైన సింగిల్ విండో ఛైర్మన్ ఆళ్ళ సుమన్‌రెడ్డి, అలాగే డైరెక్టర్లంతా ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావును ఘనంగా గజమాలతో సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ అలాగే ఉమ్మడి జిల్లాలో పొత్కపల్లి సహకార సంఘం ఆదర్శవంతంగా ప్రథమ స్థానంలో ఉండాలని కోరారు. ఇకనుంచి సొసైటీ పాలకవర్గం సంఘం అభివృద్ధికి తీవ్రంగా కృషి చేసి సంఘానికి జిల్లాలో మంచి పేరు, ప్రఖ్యాతులు సంపాదించాలన్నారు. ఈసారి ధాన్య కొనుగోలు కేంద్రాల్లో రైతులు పండించిన ధాన్యం గింజ కూడా వృథా కాదని, తూకం కాగానే ప్రతి రైతుకు ట్రక్ షీట్ అందజేస్తామని, ఏ రైతు కూడా మిల్లుల వెంట తిరిగే పరిస్థితి రాదన్నారు. గత కొనుగోలు కేంద్రాల్లో, అలాగే డిసిఎంఎస్ ద్వారా ధాన్యం కొనుగోలు చేసి సరిపోయేంతవరకు రైతులను నిలువున దోచుకున్నారన్నారు. ఈసారి ధాన్యం కొనుగోలులో కోత విధిస్తే ఎవరిని కూడా ఉపేక్షించేది లేదన్నారు. మానేరు వాగు నుంచి పొత్కపల్లికి తాగునీటి సరఫరా కోసం రూ.40లక్షలు మంజూరు అయ్యాయని, రూ.కోటి నిధుల వ్యయంతో పొత్కపల్లిలో ఒక పారదర్శకమైన అభివృద్ధి జరగనుందన్నారు. అలాగే కుమ్మరి సేవ సంఘం కమ్యూనిటీ భవనానికి, రూపునారాయణపేటలో యాదవ సంఘం కమ్యూనిటీ భవనానికి శంకుస్థాపన చేశారు. గోపరపల్లి, హరిపురం, కొలనూర్, పొత్కపల్లి, కనగర్తి, ఓదెల గ్రామాల్లో 1.7 కోట్ల 11వేల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించారు. మరోకొన్ని గ్రామాల్లో నిర్మించబోయే సీసీ రోడ్లకు శంకుస్థాపన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మూల ప్రేమ్‌సాగర్‌రెడ్డి, సింగిల్‌విండో ఛైర్మన్ ఆళ్ళ సుమన్‌రెడ్డి, ఎడవెల్లి విజయపాల్‌రెడ్డి, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బైరి రవిగౌడ్, గుండేటి ఐలయ్య, గోపు నారాయణరెడ్డి, అమ్ముల బిక్షపతి, గాజుల శివశంకర్, గుండేటి మధు, బోడకుంట లక్ష్మీ చిన్నస్వామి, బోడకుంట శంకర్, చీకట్ల మొండయ్య, నాగపురి రవీందర్, కసిరెడ్డి మహేందర్‌రెడ్డి, రఫీ, తాళ్లపల్లి శ్రీనివాస్, కిషోర్, చొప్పరి రాజన్న, ఉడిగె సదయ్య, అధికారులు పాల్గొన్నారు.

పెద్దపల్లి పార్లమెంట్ బీజేపీ టిక్కెట్ ఇవ్వాలి

-బీఎల్ సంతోష్‌కు క్యాతం వెంకటరమణ వినతి

పెద్దపల్లి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో పెద్దపల్లి నుంచి తనకే టిక్కెట్ ఇవ్వాలని చెన్నూర్ నియోజకవర్గ బీజేపీ ప్రభారి క్యాతం వెంకట రమణ ఢిల్లీలో శనివారం బీజేపీ సంఘటన్ మంత్రి బీఎల్ సంతోష్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. విద్యార్థి దశ నుంచే తాను ఏబీవీపీ కార్యకర్తగా, ఆ తర్వాత బీజేపీలో 36 ఏళ్లుగా పని చేస్తున్నానని పేర్కొన్నారు. 2012 నుంచి గోదావరి హారతి ఉత్సవ సమితి పేరిట ధర్మపురి, లక్సెట్టిపేట, ముల్కల్ల, మంచిర్యాల, వేలాల, చెన్నూర్, అంతర్గాం, గోదావరిఖని, మంథని, కాళేశ్వరంలో కార్తీక మాసంలో గోదావరి నదికి హారతి ఇచ్చామని పేర్కొన్నారు. పార్లమెంట్ పరిధిలో నిర్మాణాత్మక, ఆందోళనాత్మక కార్యక్ర మాల్లో పాల్గొన్నానన్నారు. పెద్దపల్లి పార్లమెంట్ టిక్కెట్ ఇస్తే తప్పకుండా గెలుపొందుతానని, తప్పకుండా తనకే టిక్కెట్ ఇవ్వాలని వెంకట రమణ బీఎల్ సంతోష్‌కు ఇచ్చిన వినతిపత్రంలో కోరారు.

నేటి నుంచి సీతారామచంద్రస్వామి బ్రహ్మోత్సవాలు

ధర్మారం, మార్చి9: ధర్మారంలోగల శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో ఆదివారం నుంచి 13వ తేదీ వరకు పుష్కర బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ఛైర్‌పర్సన్ పూస్కూరి పద్మజ తెలిపారు. నేటి ఆదివారం సాయంత్రం విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం, విశ్వక్సేన ఆరాధన, వాసుదేవ పుణ్యాహవచనం, రక్షబంధనం, దీక్షాదారనం, మృత్సంగ్రాహనం, అంకుర్పానం కార్యక్రమంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతామని ఆమె వివరించారు. 11న సుప్రబాతసేవ, ఆరాధన, సేవాకాలం ప్రాబోధిక, అగ్ని ఆరాధన, లక్ష్మీనారాయణ హోమం, పూర్ణహుతి, 12న దారతోరణ పూజ, యాగశాలలో అగ్ని ఆరాధన, నక్షత్ర హోమం, తర్వాత కల్యాణం, తీర్థ ప్రసాదం, కార్యక్రమాలు జరుగుతాయని ఆమె పేర్కొన్నారు. 13న గ్రహదోష నివారణ, సంతాన అభివృద్ధికి నవగ్రహ హోమం, మహాపూర్ణాహుతితో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని ఆమె తెలిపారు.

సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాల నియంత్రణ



మాట్లాడుతున్న ఎస్ఐ స్వామి

పెద్దపల్లి రూరల్, మార్చి 9: గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంతో నేరాలను నియంత్రించవచ్చని బసంత్‌నగర్ ఎస్ఐ స్వామి అన్నారు. శనివారం మండలంలోని అందుగులపల్లి, దేవునపల్లి, రంగాపూర్, రాఘవపూర్ గ్రామాలను సందర్శించారు. ఈసందర్భంగా గ్రామాల్లో పలు కూడళ్లు, పోలింగ్ జరిగే ప్రదేశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ గ్రామాల్లో తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం వల్ల నేరాలు జరిగిన త్వరగా నిందితులను పట్టుకోవచ్చాన్నారు. గ్రామాల్లో గుర్తు తెలియని వ్యక్తులు సంచరిస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. అందుగులపల్లి గ్రామానికి వచ్చిన ఎస్ఐ స్వామిని ప్రజా ప్రతినిధులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో కారే శ్రీనివాస్, దోమ్మటి సది, దామ సది, కారే రాజ్‌కుమార్, కారే రవి, ఇట్యాల అనిల్, కారే అనిల్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

ఐక్యంగా హక్కుల కోసం పోరాడాలి

ధర్మారం, మార్చి9: మాదిగలంతా ఐక్యమత్యంలో హక్కుల కోసం పోరాడాలని మాదిగ మహాదండు సంక్షేమ సంఘం జాతీయ గౌరవ సలహాదారు బొల్లి స్వామి పిలుపునిచ్చారు. శనివారం ధర్మారంలో తెలంగాణ మాదిగ మహాదండు సంక్షేమ సంఘం ముద్రించిన కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రం ప్రభుత్వ సంస్థలన్నింటినీ ప్రైవేటీకరణ చేస్తోందని ఆరోపించారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు కుశనపల్లి దుర్గయ్య, నాయకులు శనిగారపు మల్లేశం, కల్లెపల్లి మల్లయ్య, ఎల్దూరి మల్లేష్, నెరవట్ల మల్లయ్య, తాళ్లపల్లి మల్లేష్, చొప్పదండి రాములు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ హుండీ లెక్కింపు

ధర్మారం, మార్చి9: ధర్మారం మండలం నందిమేడారంలో అమరేశ్వర స్వామి ఆలయంలో జరిగిన మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా శనివారం ఆలయంలో హుండీ లెక్కింపు చేశారు. శనివారం ఆలయంలో హుండీ లెక్కింపు, ముగిసిన మహాశివరాత్రి ఉత్సవాలపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆలయంలో ఆదాయం, ఖర్చులపై చర్చించారు. ఉత్సవాల నిర్వహణకు రూ.లక్ష715 విరాళాలు, రూ.23వేల142 లడ్డూ, దర్శన టికెట్ల ద్వారా రూ.25వేల 210 హుండీ లెక్కింపు చేయగా ఆదాయం వచ్చింది. ఇందులో మొత్తం లక్ష 49వేల 67 రూపాయలకు గాను రూ.74వేల 165 ఖర్చులైనట్లు వివరించారు. ప్రస్తుతం ఆలయంలో 74వేల 902 రూపాయలు నిలువ ఉన్నాయని ప్రకటించారు. ఈ సమావేశంలో గతంలో జరిగిన లెక్కలను మాజీ అధ్యక్షుడు నేరెళ్ల చిన్న లచ్చయ్య నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు చిప్ప మణిశర్మకు అప్పగించారు.

బిల్లులు ఇప్పించాలని మాజీ సర్పంచ్ ఆందోళన



ఎంపీడీవో కార్యాలయంలో బైఠాయించిన మాజీ సర్పంచ్ రమేష్

ముత్తారం, మార్చి 9: సర్పంచ్‌గా ఉన్నప్పుడు చేసిన అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులను ఇప్పించాలని శనివారం ఖమ్మంపల్లి మాజీ సర్పంచ్ సముద్రాల రమేష్ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నల్ల కండువాతో ఫ్లకార్డులు పట్టుకొని నిరసన తెలిపాడు. తమకు రావలసిన బిల్లులు ఇవ్వకుంటే జిల్లాస్థాయిలో నిరసన వ్యక్తం చేస్తానని ఆయన అన్నారు.

ఛత్రపతి శివాజీ యువసేన ఆధ్వర్యంలో ఉత్సవాలు

కమాన్‌పూర్, మార్చి 9: మండల కేంద్రంలోని అంగడి బజార్‌లో ఛత్రపతి శివాజి యువసేన ఆధ్వర్యంలో నిర్వహించిన మహాశివరాత్రి జాగరణ ఉత్సవాలు ప్రజలను విశేషంగా ఆకట్టుకున్నాయి. మండల కేంద్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలే కాకుండా గోదావరిఖని, పెద్దపల్లి నుంచి పాఠశాలల విద్యార్థుల నృత్యాలు, గీతాలతో పాటు ఆర్కెస్ట్రా బృందం పాడిన పాటలు చూపరులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎస్ఐ చంద్రశేఖర్, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సాన రామకృష్ణరెడ్డి, సదశయ ఫౌండేషన్ లింగమూర్తి, డాక్టర్ విజయ్‌కుమార్, మాజీ సర్పంచ్ నీలం సరిత శ్రీనివాస్, ఛత్రపతి శివాజి వ్యవస్థాపకులు జంగపెల్లి శ్రీనివాస్, అధ్యక్షుడు సతీష్, ఉపాధ్యక్షులు కొమ్ము శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

కాల్వశ్రీరాంపూర్, మార్చి9: మండలంలోని కునారం, వెన్నంపల్లి, మంగపేట, జాఫర్‌ఖాన్‌పేట గ్రామాల్లో సీసీ రోడ్డు పనులు, కునారం ఎస్‌సీ కాలనీలో కమ్యూనిటీహాల్ ప్రహరీని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ నూనేటి సంపత్, జడ్పీటీసీ వంగల తిరుపతిరెడ్డి, మాజీ ఎంపీపీ గోపగోని సారయ్యగౌడ్, ఎంపీటీసీ కొల్లూరి రమాదేవి, జెట్టి దేవేందర్, మాజీ సర్పంచ్ డొంకన విజయమొగిలి, మాజీ కో ఆప్షన్ మెంబర్ ఎండీ సజ్జు, ఖలీమోద్దీన్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గాజనవేన సదయ్య, కలవేన రమేష్, ఈర్ల ప్రవీణ్ పాల్గొన్నారు.



మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో ఉద్యోగికి రజతం

యైటింక్లయిన్‌కాలనీ, మార్చి 9: సౌత్ ఇండియా మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో సింగరేణి ఉద్యోగి కండెవాడ బుగ్గాజి రజత పతకాన్ని సాధించారు. శనివారం కర్ణాటకలోని ఉడిపిలో మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రెండవ సౌత్ ఇండియా మాస్టర్స్ అథ్లెటిక్స్ ఓపెన్ ఛాంపియన్‌షిప్ పోటీలు ప్రారంభమయ్యాయి. ఈపోటీల్లో 5000 మీటర్ల రేస్‌వాక్ 55 సంవత్సరాల విభాగంలో బుగ్గాజి రెండవ స్థానంలో నిలిచి రజత పతకాన్ని సాధించారు. అసోసియేషన్ ప్రెసిడెంట్, సెక్రెటరీలు సురేందర్‌షెట్టి, ఉదయ్‌కుమార్‌లు బుగ్గాజికి పతకాన్ని, ప్రశంసాపత్రాన్ని అందజేశారు.

ఏపీఏలో రిజియన్ సేఫ్టీ జీఎంకు సత్కారం

రామగిరి, మార్చి 9: సింగరేణి సంస్థ ఏపీఏ డివిజన్ పరిధిలోని ఏఎల్‌పీలో శనివారం బాధ్యతలు చేపట్టి తొలిసారిగా పర్యటించిన ఏరియా సేఫ్టీ జీఎం రఘుకుమార్‌ను జీఎం వెంకటేశ్వర్లు, అధికారులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అధికారులు సీతారామం, వెంకటరమణ, రఘురాం, జనార్థన్, తిరుపతి, వెంకటేశ్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ పోటీలు

యైటింక్లయిన్‌కాలనీ, మార్చి 9: కెవిన్ ఫ్రెండ్లీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కాలనీలో శుక్రవారం ఫుట్‌బాల్ పోటీలు జరిగాయి. శివరాత్రిని పురస్కరించుకుని శుక్రవారం రాత్రి స్థానిక అబ్దుల్ కలాం స్టేడియంలో పోటీలను అసోసియేషన్ ఛైర్మన్ వినోద్ కుకునూర్, కవిత కుకునూర్‌లు ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. 16 జట్లు పాల్గొనగా అసోసియేషన్ ఛైర్మన్ వినోద్ కుకునూర్ క్రీడాకారులను పరిచయం చేసుకుని మాట్లాడారు. యువత తప్పనిసరిగా ఏదైనా క్రీడలో నైపుణ్యత సాధించాలని, వ్యాయామం, ఆటలు నిత్య జీవితంలో భాగస్వామ్యంగా అలవాటు చేసుకోవాలని సూచించారు. ఆరోగ్యవంతులైన యువత ఉన్న దేశం అభివృద్ధి పథంలో పయనిస్తుందని అన్నారు. విద్యార్థులు, యువతకు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు వంటి విషయాల్లో కెవిన్ ఫ్రెండ్లీ ఫౌండేషన్ అవసరమైన సహాయసహకారాలను అందిస్తుందని వినోద్‌కుకునూర్ తెలిపారు. అనంతరం పోటీల్లో గెలిచిన జట్లకు, ఉత్తమ క్రీడాకారులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు శంకర్‌నాయక్, కిషన్‌రెడ్డి, ఫౌండేషన్ అధ్యక్షుడు ఎండీ ఫయాజ్ పాల్గొన్నారు.

త్రయంబకేశ్వరాలయంలో అన్నదానం

రామగిరి, మార్చి 9: సింగరేణి ఆర్జీ-3 డివిజన్ పరిధిలోని ఎస్‌అండ్‌పీసీ కార్యాలయంలోని త్రయంబకేశ్వరాలయంలో శనివారం అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆర్జీ-3, ఏపీఏ జీఎంలు సుధాకర్‌రావు, వెంకటేశ్వర్లు ముఖ్య అతిథులుగా హాజరై త్రయంబకేశ్వరునికి ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం అన్నదానం కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో అధికారులు రఘుపతి, శ్రీనివాసులు, లక్ష్మీనారాయణ, చంద్రశేఖర్, ముప్పిడి రవీందర్‌రెడ్డి, ఐలయ్య, గుర్రం శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

మేనేజ్‌మెంట్ ట్రైనీ పోస్టులను భర్తీ చేయాలి



సీఎండీకి వినతిపత్రం ఇస్తున్న హెడ్ ఓవర్‌మన్లు

యైటింక్లయిన్‌కాలనీ, మార్చి 9: మేనేజ్‌మెంట్ ట్రైనీ(మైనింగ్) పోస్టులను ఎక్స్‌టర్నల్ అభ్యర్థులతో కాకుండా అండర్ మేనేజర్ (ఈ-2)లతో భర్తీచేయాలని మైనింగ్ స్టాఫ్ సిబ్బంది సింగరేణి ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ బలరాంను కోరారు. శనివారం సీఎండీని మైనింగ్ స్టాఫ్ సిబ్బంది కలిసి మైనింగ్ స్టాఫ్ సిబ్బంది పదోన్నతులు, పోస్టుల భర్తీపై వినతిపత్రాన్ని అందజేశారు. అండర్ మేనేజర్(ఈ-2) ప్రమోషన్లు కోల్ ఇండియా గైడ్‌లైన్స్ ప్రకారం ఎవరైతే సెకండ్ క్లాస్ మేనేజర్ సర్టిఫికేట్ కలిగి ఉన్న ఏ గ్రేడ్, ఏ1 గ్రేడ్ హెడ్ ఓవర్‌మెన్‌లతో భర్తీ చేయాలని కోరారు. అండర్ మేనేజర్ (ఈ-2) ఇంటర్నల్ ఖాళీలను 5సంవత్సరాలకు ఒకసారి నామమాత్రంగా 20 లేదా 25 ఖాళీలు మాత్రమే భర్తీ చేయడం వలన సెకండ్ క్లాస్ మేనేజర్ పాసైన వారి సంఖ్య సుమారు 350కి చేరినట్లు తెలిపారు. 350 అంతర్గత అభ్యర్థులకు న్యాయం జరగాలంటే కంపెనీ ఐఈడీ ఖాళీల ప్రకారం 139, ఇంటర్నల్ ఖాళీలను కలుపుకుని, అండర్ మేనేజర్(ఈ-2) అభ్యర్థులతో భర్తీ చేయాలని కోరారు. ప్రస్తుత 139 మైనింగ్ ఖాళీలను నిలిపివేసి అండర్‌మేనేజర్ (ఈ-2) అభ్యర్థులతో భర్తీ చేయాలని సీఎండీకి విజ్ఞప్తి చేశారు. అనుభవం ఉన్న మైనింగ్ స్టాఫ్‌తో ఖాళీలను భర్తీ చేయడం వలన చిత్తశుద్ధితో పనిచేసి సంస్థ అభివృద్ధికి దోహదపడుతారని, మైనింగ్ స్టాఫ్‌కు మేలు చేసేలా యాజమాన్యం పోస్టు భర్తీలో న్యాయం చేయాలని మైనింగ్ స్టాఫ్ సిబ్బంది సీఎండీ బలరాంను కోరారు.

మహిళా ఉద్యోగులకు ఆటలపోటీలు



ఆర్జీ-2 జీఎం ఆఫీస్‌లో ఆటలపోటీల్లో పాల్గొన్న మహిళా ఉద్యోగులు



ఆర్జీ-3లో పోటీలను ప్రారంభిస్తున్న పర్సనల్ మేనేజర్ రవీందర్‌రెడ్డి

యైటింక్లయిన్‌కాలనీ, మార్చి 9: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో ఆర్జీ-2 మహిళా ఉద్యోగులకు ఆటల పోటీలను నిర్వహించారు. జీఎం కార్యాలయ ఆవరణలో జరిగిన పోటీల్లో మ్యూజికల్ ఛైర్, బాల్ త్రో, బాంబ్ ఇన్ సిటీ వంటి పోటీల్లో ఉద్యోగినిలు ఉత్సాహంగా పాల్గొన్నారు. పురుషులతో సమానంగా మహిళలు సింగరేణి అభివృద్ధిలో తమవంతు పాత్ర పోషిస్తున్నారని జీఎం సూర్యానారాయణ అన్నారు. పోటీల్లో గెలిచిన వారికి శనివారం జరిగే మహిళా దినోత్సవ కార్యక్రమంలో బహుమతులను అందజేయనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీజీఎం పర్సనల్ రాజేంద్రప్రసాద్, ఏఐటీయూసీ నాయకులు ఎల్ ప్రకాష్, రాజారత్నం, అన్నారావుతో పాటు అధికారులు పాల్గొన్నారు.

రామగిరి, మార్చి 9: సింగరేణి సంస్థ ఆర్జీ-3 డివిజన్‌లో అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని పురస్కరించుకొని సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో శనివారం మహిళలకు ఆటల పోటీలను నిర్వహించారు. ఈ పోటీలను పర్సనల్ మేనేజర్ ముప్పిడి రవీందర్ ప్రారంచించారు. ఈ పోటీల్లో విజేతలకు 11న స్థానిక కమ్యూనిటీ హాల్‌లో బహుమతులను ప్రదాన కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. ఈ వేడుకలకు అధిక సంఖ్యలో మహిళలు హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధికారులు గుర్రం శ్రీహరి, సునీల్‌ప్రసాద్, రాజేశ్వరి, శ్యామల, కోఆర్డినేటర్ రాయమల్లు, మహిళలు పాల్గొన్నారు.